# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 17

*ఆ మర్నాడు నరేంద్ర గజపతి విజయనగరం చేరుకున్నాడు.* సరాసరి వెళుతూనే దేవరాయల్ని కలవడానికి రాజ మందిరానికి వెళ్ళాడు. వెళ్ళేసరికి అక్కడ వేదరాయశర్మ కూడా ఉన్నాడు. నరేంద్ర గజపతి వస్తున్నాడని తెలియగానే దేవరాయల మొహంలో చిరునవ్వు వికసించింది.

బావమరిది వెళ్ళిన పని పూర్తిచేసుంటాడనీ, నేహల్ని బంధించి తెచ్చుంటాడనీ ఊహించుకున్నాడు. పక్కనే ఉన్న వేదరాయశర్మకీ ఇదే తరహా ఉత్కంఠ నెలకొని ఉంది. ముందుగా సేవకుడు వచ్చి నరేంద్ర గజపతి వస్తున్నాడని కబురు తెచ్చాడు. కొంతసేపటికి నరేంద్ర గజపతి ఒక్కడే వచ్చాడు.

సాధారణంగా ఇలాంటి రాచకార్యాలు చక్కబెట్టొచ్చాక తోడుగా వెళ్ళిన దండనాయకులతో కలిసి రాజ దర్శనం చేసుకుంటారు. అలాంటిది నరేంద్ర జగపతొక్కడే రావడం ఇద్దరికీ ఆశ్చర్యం కలిగించింది. వేదరాయశర్మకి చిన్నగ అనుమానం బయల్దేరింది.

దూరం నుండి నరేంద్రగజపతి చూడగానే - "రండి మరిదిగారూ! మీకోసమే గత రెండు నాడులుగా ఎదురుచూస్తున్నాం. వెళ్ళిన పని విజయవంతంగా ముగిసిందనీ తలుస్తాను." అంటూ ఆహ్వానించాడు.

నరేంద్రగజపతి ముఖంలో చిరునవ్వు లేదు.

ప్రతి నమస్కారం చేసి, "మహారాజా! అనుకొన్నది ఒకటయితే మరొకటి జరిగింది. మీరు చెప్పినట్లుగానే ముద్గల్ గ్రామానికి వెళ్ళాం. అమ్మాయిని కలవడానికి వెళితే కొంతమంది యువకులు మన సైన్యం మీద దాడి చేసారు. ఆ అమ్మాయిని ఎవరికీ కనబడకుండా దాచేసారు. మీరు పంపిన కారణం చెప్పినా వారు వినలేదు. మిమ్మల్ని నానా మాటలూ అన్నారు. ఆ మూకని చెల్లా చెదురు చేయడానికి మాకు కాస్త సమయమే పట్టింది. వీరందరూ ఎందుకిలా మామీద దాడికి దిగారాని ఆరా తీస్తే దీని వెనుక గుల్బర్గా సుల్తానుల హస్తముందని తెలిసింది. వాళ్ళ అండదండలు చూసుకునే మాపై చిన్న తిరుగుబాటు ప్రకటించారు. ముందు చూపుగా సైన్యాన్ని తీసుకెళ్ళడం మంచిదయ్యింది. లేకపోతే నన్నూ చంపేసుండేవారు. ఏదయితేనే ఆ అమ్మాయి పారిపోయింది." అంటూ తలదించుకునే చెప్పాడు.

ఇది విని దేవరాయలు నిశ్చేష్టుడయ్యాడు. వేదరాయశర్మ నోట మాట లేదు. గుల్బర్గా సుల్తానులకి విషయం ఎలా తెలిసింది? అయినా ముద్గల్ గ్రామ యువకులు దండెత్తడం ఏమిటి? ఏ విషయమూ నమ్మ బుద్ధి కాలేదు.

"ఆ అమ్మాయి పారిపోయిందా? అసలు మీరెళ్ళినట్లు వారికెలా తెలిసింది?" ఆశ్చర్యం ప్రకటించాడు దేవరాయలు.

"మనవాళ్ళనుకున్న వాళ్ళే నమ్మకద్రోహం చేసి ఆ అమ్మాయిని పారిపోయేలా చేసారు మహారాజా!" అంటూ వేదరాయశర్మ కేసి చూస్తూ అన్నాడు.

"మనవాళ్ళా?" ఏమీ అర్థంకాలేదు దేవరాయలకి. అయోమయంగా చూసాడు.

"క్షమించాలి, మహారాజా! మా ముద్గల్ ప్రయాణం గురించి వేదరాయశర్మ గారి శిష్యుడు మాకంటే ముందుగా వెళ్ళి ఆ అమ్మాయికి చేరవేసాడు." నరేంద్రగజపతి వేదరాయశర్మకేసి కన్నెర్రజేసి చూస్తూ అన్నాడు. ఇది విని వేరాయశర్మ అవాక్కయ్యాడు.

"నిజమేనా? అన్నట్లు అనుమానంగా చూసాడు మహారాజు.

"నాకేం అర్థం కావడం లేదు మహారాజా! నా శిష్యుడు శంభుడు ముద్గల్ వెళ్ళాడు. కానీ అతను నరేంద్రగజపతుల వారు బయల్దేరిన మర్నాడు వెళ్ళాడు. ఎంతలేదన్నా ముద్గల్ చేరడానికి రెండు దినాలు పడుతుంది. ఎంత చూసినా నరేంద్రగజపతుల వారికంటే ముందుగా వెళ్ళడం అసాధ్యం. వీరందరూ గుర్రాలూ, రథాలపై వెళ్ళారు. వాళ్ళను దాటుకొని వెళ్ళడం అసాధ్యం. పైగా శంభుడు వట్టి పిరికివాడు. అతను ముద్గల్లో యువకులందరినీ పోగుచేసే అవకాశమే లేదు. ఎక్కడో ఏదో తప్పు జరిగుంటుంది. చుట్టుపక్కల గ్రామాలన్నింటిలోనూ మా ముద్గలే చాలా మంచి గ్రామం అని పేరుంది. అలాంటిది ఇలా తిరుగుబాటు..." వేదరాయశర్మకి ఇంకేం చెప్పాలో పాలుపోలేదు.

దేవరాయలకీ ఎందుకో నరేంద్రజగపతి చెబుతున్న మాటలు నమ్మ బుద్ధి కాలేదు. అధికారుల ద్వారా వివరాలు తెలుసుకునే వరకూ ఏమీ అనలేడు. ఒక పక్క నేహల పారిపోయిందన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నాడు. కానీ పైకి ఏమీ అనలేదు. నరేంద్రగజపతి తీసుకున్న శ్రమని మెచ్చుకొనీ అతన్ని పంపించేసాడు.

వేదరాయశర్మ నరేంద్రగజపతి వెళ్ళేవరకూ ఒక్క మాటంటే మాట మాట్లాడలేదు. ఏం జరిగిందో అంతా అయోమయంగా ఉంది. ప్రస్తుతం తనే నేహల పారిపోవడానికి కారణమని మహారాజు మనసులో నాటిందని గ్రహించాడు.

"మాహారాజా! నాదొక చిన్న మాట. నా శిష్యుడు శంభుడు నాతో చెప్పే వెళ్ళాడనీ మీకు చెప్పాను కదా? ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. నరేంద్రగజపతి మాటలు ఎందుకో నమ్మశక్యంగా లేదు. నా దొక చిన్న మనవి. మీరు నరేంద్ర గజపతుల వారితో పంపిన దండనాయకుల్ని అడిగి వివారలు తెలుసుకోండి." అని మాత్రం అనగలిగాడు.

దేవరాయలకీ విషయం పూర్తిగా అర్థం కాలేదు. జరిగింది సగం సగం మాత్రమే తెలుసు. దేవరాయశర్మ చెప్పింది సమంజసంగానే తోచింది. దండనాయకులకి కబురంపాడు. కొంతసేపటికి దండనాయకులు వచ్చారు. ముద్గల్లో జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పారు.

"మాహారాజా! నరేంద్రగజపతుల వారు ఎంత చెప్పినా వినలేదు. అనవసరంగా కల్లోలం సృష్టించి ప్రజల్ని భయపెట్టారు. పారిపోయిందనుకున్న ఆ అమ్మాయిని వెతకడంలో ప్రతీ ఇంటినీ సోదా చేయించడంలో మన సైన్యం కాస్త దుడుకుగా ప్రవర్తించే అవకాశముంది. కానీ నరేంద్రుల వారి ఆజ్ఞ ప్రకారమే మేము నడుచుకున్నాం తప్ప మా సొంత నిర్ణయాలేవీ కావు. ఏదైనా తప్పు జరిగితే క్షమించండి." అంటూ సెలవిచ్చారు.

నరేంద్రగజపతి చేసిన నిర్వాకానికి మింగాలేని కక్కాలేని పరిస్థితి ఎదురయ్యింది.

"వేదరాయా! మీరూహించింది నిజమే! నరేంద్రగజపతి ఆవేశం వల్ల జరిగిన అనర్థమిదంతా. బెదిరింపుల వల్ల జరిగిన తప్పిదం ఇది. నేహల పారిపోవడానికి ఇవే కారణం కనిపిస్తోంది." అంటూ పైకి అన్నాడు కానీ లోలోపల నరేంద్రగజపతి చేసిన దానికి కోపం సెగలు కక్కుతోంది.

"మాహారాజా! మీరనుమతిస్తే నేను తక్షణమే ముద్గల్ వెళతాను. అక్కడ మా వాళ్ళందరూ ఎలా వున్నారో! ఊరంతా వల్లకాడుగా మార్చాడని దండనాయకులు చెబుతున్నారు. ఎందుకైనా మంచిది నాకు మీ వాళ్ళనెవరినయినా తోడిప్పించి పంపించండి." అంటూ వేడుకున్నాడు. దేవరాయలు తగిన ఏర్పాట్లు చేయించమని అక్కడున్న అధికారులకి చెప్పాడు.

వేదరాయశర్మ మనసు ఆందోళన చెందుతోంది. నేహాల ఎలా తప్పించుకుంది? ఎవరు సాయం చేసారు. ఎవరికీ ప్రాణ నష్టం కలగలేదు కదా? ఎన్నో ప్రశ్నలు. దానికిమించి అనుమానాలు. మనసు కకావికలమయ్యింది.  వీటన్నింటికీ పరోక్షంగా తనే కారణం అన్న భావన వేదరాయశర్మనింకా తాక లేదు. ముద్గల్ వెళ్ళే వరకూ అతనికి స్థిమితం లేదు.

0000000000000000

నేహాలా, తల్లీ తండ్రీ, రేవన్నా అందరూ రాయచూరు చేరుకున్నారు. మసూం ఒక జట్కా బండిని బాడుగకి తీసుకున్నాడు. బండిలో నేహాలా వాళ్ళూ కూర్చున్నారు. మసూం మాత్రం తన గుర్రం మీద బయల్దేరాడు. రేవన్న కూడా వేరే గుర్రమ్మీద బండి వెనుకనే వెళ్ళాడు.

బయల్దేరేముందు ఒక చిన్న చేతి సంచీ నేహాల్ చేతికిచ్చాడు. అందులో రెండు నల్లని బురఖాలున్నాయి.

"ఇవి మీ ఆడవాళ్ళ కోసం తెచ్చిన బురఖాలు. మిమ్మల్ని ఎవరైనా గుర్తుపడితే ప్రమాదం. ఎవరైనా అడిగితే మీరు నా బంధువలనే చెప్పండి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ బురఖాలు తీయద్దు. హరీంద్ర గారూ, మీరూ మీ వేషం కాస్త మార్చుకోవాలి. నన్నొక ముసల్మానుగానే అందరూ అనుకుంటారు. ఎవరడిగినా మీ వివరాలు మాత్రం చెప్పదు. అసలు మీరు ఎవరిముందూ నోరిప్పద్దు." అంటూ జాగ్రత్తలు చెప్పాడు.

నేహాల తల్లికి జరుగుతున్నదంతా చూస్తుంటే భయం వేసి గట్టిగా యేడ్చింది. నేహాలా, హరీంద్రా సముదాయించారు.

దారిపొడుగునా రేవన్నా భయం లేదని చెబుతూ, ఓ రెండు మూడు వారాలు ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయనీ చెప్పాడు. వీలు వెంబడి తనూ ముద్గల్ వెళ్ళి అక్కడ పరిస్థితి చూసొస్తాననీ చెప్పాడు. మహారాజు సైనికుల కంట పడితే ప్రాణాలకే ముప్పనీ, అందువల్ల తగు జాగ్రత్తతో ఉండాలనీ అన్నాడు.

ఆ సాయంత్రానికి రాయచూరు చేరుకున్నారు. మసూం ఊరి చివర్న ఒక చిన్న ఇల్లుని బాడుగకి తీసుకొని నివసిస్తున్నాడు. ఇంటి యజమాని మంచివాడనీ చెప్పాడు. ఎవరి వద్దా తమ వివారాలు మాత్రం చెప్పొద్దనీ చెప్పాడు.

సాధారణంగా మసూం ఒక్కడే ఉంటాడు. ఎప్పుడూ బంధువులూ రావడం చూళ్ళేదు ఆ ఇంటి యజమానికి. అలాంటిది ఇద్దరు స్త్రీలు కూడా రావడం ఆ ఇంటి యజమానికి ఆశ్చర్యం కలిగింది. అదే విషయం అడిగాడు.

"ఏం మసూం! మీ బంధువులా? ఏవూరు?" అని ప్రశ్నలు గుప్పించాడు. అతని పేరు సుబ్బయ్య.  వూళ్ళో వాళ్ళకి వైద్యం అదీ చేస్తాడానీ చెప్పాడు మసూం.

"మా భాయీ, అతని కుటుంబమూ! సింధనూరులో ఉంటారు. కొంతకాలం ఇక్కడే ఉంటారు." అని ముక్తసరిగా చెప్పాడు.

ఇంటి లోపలకి వెళ్ళాక ఇల్లంతా చూపించాడు. ఉండేది ఒక్కడే అయినా రెండు మూడు గదులున్నాయి. స్నానం చేసి రాత్రికి వంట చేస్తాననీ హరీంద్ర భార్య చెప్పింది.

నేహాలా వాళ్ళకి ఒక గది ఇచ్చాడు. రేవన్న మసూం చేసిన సాయానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాడు.

"భాయీ, మసూం! నీతో పరిచయం తక్కువయినా మమ్మల్ని రక్షించావు. నీ మేలెప్పటికీ మరువలేం!" అంటూ నేహాలా అతన్ని కృతజ్ఞతలు చెప్పుకుంది.

స్నానానికి ఉపక్రమించబోతుండగా మసూం రెండు మూడు చీరలు తెచ్చి నేహాల్కిచ్చాడు.

"మీరు కట్టుబట్టలతో వచ్చేసారు. మీరీ చీరలు వాడుకోవచ్చు." అంటూ అందించాడు. నేహలా,తల్లీ అతని మంచితనానికి కరిగిపోయారు.

"మసూం! నువ్వు మాకు పరిచయం కావడం మా అదృష్టం. సొంత వాళ్ళల్లా చూసుకుంటున్నావు. నిన్నో విషయం అడగచ్చా?"

అడగమన్నట్లు తలూపాడు. చేతిలో చీరలు చూపించి ఎవరివన్నట్లు సంజ్ఞ చేసింది.

"అవా! నా భార్యవి." అంటూ ముక్తసరిగా జవాబిచ్చాడు. ఇంతవరకూ మసూంకి పెళ్ళి కాలేదనుకున్నారు అందరూ! అతనికి పెళ్ళయ్యిందని తెలిసి ఆశ్చర్యపోయారు.

"నీ భార్యవా! నీకు పెళ్ళయ్యిందా? ఇప్పుడామెక్కడుంది?" అంటూ ప్రశ్నించారు.

"తెలీదు. అదొక పెద్ద కథ. తరువాత చెబుతాను. నా అసలు పేరు మసూమే! మీరనుకున్నట్లు నా అసలు పేరు బసప్ప కాదు. నేనెందుకు ఇలా రెండు పేర్లతో వ్యవహరిస్తున్నానో తరువాత చెబుతాను." అంటూ అక్కడనుండి కదిలాడు.

అతనీ మాటలంటున్నంత సేపూ అతని మొహంలో రంగులు మారాయి. వాటి వెనుక పొరలు పొరలుగా దాక్కున్న బాధ కంటి తెరలు చీల్చుకు రావడం గమనించారందరూ!

ఎవరూ అతని మాటల్ని పొడిగించలేదు.

00000000000000

దేవరాయల మందిరం నుండి సరాసరి ఉమాదేవి మందిరానికి వెళ్ళాడు నరేంద్ర గజపతి.

తమ్ముణ్ణి చూడగానే సంతోషంగా ఎదురొచ్చింది ఉమాదేవి.

"అక్కా! విజయోస్తు! వెళ్ళిన పని నిర్విఘ్నంగా చేసుకొచ్చాను. ఆ అమ్మాయి పీడ వదిలింది నీకు. మహారాజుకి పెళ్ళి జరిగే అవకాశమే లేదు. నీ తమ్ముడు అనుకున్నది సాధించాడు!" అంటూ ఆనందంతో గట్టిగా చెప్పాడు.

"నిజంగానా!" అని సంతోషం ప్రకటించి, వివరాలడిగి తెలుసుకుంది ఉమాదేవి.

దేవరాయలతో అన్నీ కట్టుకథలు చెప్పినా, అక్క గారి దగ్గర మాత్రం తన పథకం ఎలా పారించాడో చెప్పాడు. తన ధాటికి తట్టుకోలేక ఆ అమ్మాయి పారిపోయిందనీ ఇహ మరలా ముద్గల్ రాదనీ చెప్పాడు. చెప్పినదంతా శ్రద్ధగా వింది.

అంతా విన్నాక ఎందుకో భయం వేసింది.

"ఇదంతా మహారాజుకి విన్న వించావా?"

"ఇదంతా చెప్పడానికి పిచ్చివాణ్ణనుకున్నావా? గుల్బర్గా సుల్తానుల ప్రోద్బలంతో అమ్మాయి తరపున కొంతమంది యువకులు మాపై దాడి చేసారనీ చెప్పాను. వాళ్ళందర్నీ సమర్ధవంతంగా ఎదుర్కొన్నాననీ చెప్పాను. పనిలో పనిగా వేదరాయశర్మనీ ఇరికించాను. ఆ-యనే ప్రజల్ని పురికొల్పాడన్న అనుమాన బీజం మహారాజు మనసులో నాటాను. నే చెప్పినదంతా రహస్యంగా ఉంచు. మహారాజు ఒకవేళ అడిగితే నేను కలవలేదనీ చెప్పు." అంటూ సర్ది చెప్పాడు.

ఉమాదేవికి ఏం కొంప మునుగుతుందోనన్న భయం కలిగింది. ఎంత తనమాట విన్నా, ఒక్కోసారి మహారాజు మూర్ఖంగానూ, మొండిగానూ ఉంటాడు. అదే విషయం పైకి చెప్పింది కూడా.

"ఎందుకంత గాభరా పడతావూ! అసలు నేను ముద్గల్ వెళ్ళినట్లుకూడా తెలీదని బుకాయించు. రాచకార్యాల్లో తలదూర్చడం ఇష్టముండదనీ చెప్పు. ఇంకా గట్టిగా గదమాయిస్తే ఈ వయసులో ఇంకో పెళ్ళాని నిలదీయి. తప్పించుకోడానికి మార్గాలు చాలానే ఉన్నాయి. ఇహ ఆఖరి అస్త్రం మీ ఆడవాళ్ళకెలాగూ ఉండనే ఉంది." అంటూ నిర్భయంగా చెప్పాడు.

"సరేలే! మహారాజు ఇవాళ వస్తాడని నేనుకోను. రాత్రికి ఆనెగొంది వెళతాననీ చెప్పారు." ఉమాదేవి మెల్లగా చెప్పింది.

"ఆనెగొంది? దేనికి?"

"ఏవుందీ, పెద్దావిడ వచ్చి తీరాలనీ కబురంపిందట. ఈయనా ఆనెగొంది వెళ్ళి పిల్లల్ని చూసొస్తాననీ అన్నారు." అంటూ మూతి తిప్పుకుంటూ అంది. దేవరాయల మొదటి భార్య పేరు సువర్చల. మొదటి భార్యా, పిల్లలూ ఆనెగొంది కోటలో నివాసముంటారు. కొడుకు రామచంద్ర రాయలూ, కూతురు మంజరీ తల్లి దగ్గరే ఉంటారు. ఎప్పుడైనా శుభ కార్యాలకి తప్ప విజయనగరం వాళ్ళు వెళ్ళరు. అదీ మహారాజు పిలిస్తే తప్ప అటు వైపు కన్నెత్తి చూడరు. అలాని దేవరాయలు వాళ్ళకి తక్కువచేయడు. అందుకే ఆనెగొంది కోటని వారి నివాసంగా మార్చాడు. కొడుకు రామచంద్ర రాయలు అక్కడి పరిపాలనని చూసుకుంటాడన్న ఉద్దేశ్యం కూడా ఉంది. కానీ తమని తక్కువ చేస్తున్నారన్న నెపంతో రామచంద్ర రాయలూ అంతగా పట్టించుకోడు.

"ఆవిడ కబురంపిందా? ఎందుకో కనుక్కున్నావా?"

'ఆ'! ఏవుంటుందీ, కూతురికి పెళ్ళి విషయమయ్యుంటుంది. అయినా నేనడగలేదు. నాకెందుకు చెప్పివన్నీ?" నిర్లక్ష్యంగా అంది.

"అలా కొట్టి పారేయకు అక్కా! మనకిక్కడ స్థాన బలం లేదు. వెయ్యికళ్ళతో చూసుకోవాలి. ఇప్పుడే చూస్తున్నావు కదా? నీకు తెలీకుండానే మహారాజు మరో పెళ్ళికి సిద్ధమయ్యాడు. అది పెటాకులు చెయ్యడానికి ఎంత కష్ట పడ్డానో చూస్తూనే ఉన్నావు. మహారాజు రాగానే వివరాలడుగు. విషయం తెలుస్తుంది." అంటూ బోధ చేసాడు. సరేనంది.

"ఇంతకీ మహారాజు ఎప్పుడు విజయనగరం వస్తాడరట?" మరలా ప్రశ్నించాడు.

"ఒక వారం ఉంటాననీ చెప్పారు. ఏవో రాచకార్యాలున్నాయనీ చెప్పారు."

నరేంద్రగజపతికి ఎందుకో అనుమానం కలిగింది. తనులేనప్పుడు ఏదో జరిగిందన్న ఆందోళన మొదలయ్యింది. ఉమాదేవికి రాజకీయం అర్థంకాదు. తెలుసుకోవాలన్న తాపత్రయం కూడా లేదు. తన బాధల్లా ఒకటే! తమ ఉనికికి ఎప్పుడూ ముప్పు రాకూడదు.

అధికారుల దగ్గర ఆరా తీయచ్చనీ అనుకొని ఆ సంభాషణ ఇహ పొడిగించలేదు.

ముద్గల్ విశేషాలు మరిన్ని చెప్పి ఆ రాత్రికి అక్కడే భోజనం చేసి వెనుతిరిగాడు నరేంద్రగజపతి.

0000000000000000000

ఫిరోజాబాదు కోట ప్రారంభ ముహూర్తం దగ్గరపడింది. గిసుదరాజు తన అనుయాయిలందరితోనూ భీమనది ఒడ్డునున్న ఫిరోజాబాద్ వద్దకొచ్చాడు. అందరూ వచ్చినా, తండ్రిపై కోపంతో రానని హసన్ మొండికేసాడు. గిసుదరాజ్ వచ్చితీరాలని పట్టుపట్టడంతో హసనూ, అతని వెనుకే మెహజబీన్ బయల్దేరారు.

ముందుగా భీమనది పనులు పర్యవేక్షించాడు. కాలువలు తవ్వడం వల్ల వచ్చే వర్షాకాలం నాటికి భీమనది నీరు వృధాకాదనీ ప్రజలకి నీటి ఎద్దడి తగ్గుతుందనీ, అహ్మదుఖాన్ తలపెట్టిన ఈ పనిని ఎంతగానో మెచ్చుకున్నాడు గిసుదరాజ్. ఫిరోజాబాద్ కోటని చూసి అతను సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు. ఢిల్లీలో కోటని తలదన్నేలా నిర్మించారు. ఎన్నో సౌకర్యాలతో ఎంతో సుందరంగా తీర్చి దిద్దిన కోటని చూసి మరింత మెచ్చుకున్నాడు గిసు దరాజ్.

కోట ప్రారంభానికి సన్నాహాలు మొదలయ్యాయి. గుల్బర్గా ప్రజలందరూ వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసారు. సుల్తాన్ ఫిరోజ్‌షా కుటుంబీకులూ విచ్చేసారు.

మర్నాడు కోట ప్రారంభం కార్యక్రమంలో ఉదయాన్నే గిసుదరాజు అక్కడ నమాజు చేయించడానికి ఏర్పాట్లు జరిగాయి. అందులో పాల్గొన్న వేలాది మందినుద్దేశించి గిసుదరాజు ప్రసంగించాడు. ఫిరోజ్‌షా పరిపాలననీ, అహ్మద్‌ఖాన్ కార్యదీక్షతనీ పలువిధాల పొగిడాడు గిసుదరాజ్.

ఆ రాత్రి విందు భోజనం ఏర్పాటు చేసారు. అందరూ విచ్చేసారు కానీ అహ్మద్‌ఖాన్ జాడ లేదు. తమ్ముడేమయ్యాడాని ఫిరోజ్‌షా కంగారు పడ్డాడు. కొంతసేపటికి విందు చేస్తూండగా పరుగు పరుగున అక్కడికొచ్చాడు అహ్మద్‌ఖాన్! వస్తూనే అన్నగారి చెవిలో ఏదో చెప్పాడు. సుల్తాన్ గిసుదరాజుకి చెప్పాడు. విందు మధ్యలో వదిలేసి అందరూ అక్కడే ఉన్న ఒక మందిరంలో సమావేశమయ్యారు.

"ఏమయ్యింది అహ్మద్! విషయం చెప్పు? ఏమిటీ హడావిడి?" గిసుదరాజ్ ఆత్రంగా ప్రశ్నించాడు.

"మౌలియా! కొంప మునిగింది. దేవరాయలు మరలా మనపై యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడట. రాయచూరు ఒప్పందం జరిగి ఇంకా ఏడాది కాలేదు. దాన్ని కాలరాసి ఇంతలోనే మరో యుద్ధమా?" ఆవేదనగా అన్నాడు అహ్మద్‌ఖాన్.

"ఇది నీ కెవరు చెప్పారు? ఇందులో నిజా నిజాలెంత? ఎవరైనా కావాలని పుకార్లు పుట్టించారా?" గిసుదరాజ్ ఎదురు ప్రశ్నించాడు.

"రూఢిగానే తెలిసింది. తెలిసినప్పటినుండీ మనసు మనసులో లేదు. మరో యుద్ధం అంటే..." మాటలు పూర్తికాకుండానే ఆ-పేసాడు.

"ఎవరు చెప్పరన్నది నువ్వు చెప్పలేదు?" ఈసారి ఫిరోజ్‌షా అడిగాడు.

"వేగులు చెప్పారు." అంటూ వ్యక్తిని ప్రవేశ పెట్టమని పక్కనే ఉన్న వ్యక్తికి చెప్పాడు.

"క్రితంసారి రాయచూరు నుండి మనపై యుద్ధానికొచ్చాడు. ఈసారి ఉత్తరభాగం నుండి మనపై దాడి చెయ్యాలని ప్రణాలిక సిద్ధం చేస్తున్నారట. రాయచూరు అయితే అందరికీ తెలిసే అవకాశం వుంది. ముఖ్యంగా మనకి. అందు నిమిత్తమై సైన్యాన్ని లింగసుగూరు వైపు తరలిస్తున్నాడనీ వేగులు చెప్పారు. ఇవాళో రేపో మనకి ముప్పు తప్పేలా లేదు. అదీకాకుండా విజయనగర కోటకి కొత్త ప్రాకారాన్ని కూడా నిర్మించాడనీ తెలిసింది. ఇవన్నీ మనపై యుద్ధానికి వ్యూహాలే!" అహ్మద్ ఖాన్ అన్నాడు.

అతని మాటల్లో త్వరలో యుద్ధం వస్తోందన్న ఆందోళన స్పష్టంగా తెలుస్తోంది అక్కడున్నందరికీ!

కొంతసేపటికి ఒక వ్యక్తి వచ్చాడు. అందరూ ఎవరాని అతనికేసి ఆశ్చర్యంగా చూసారు.

ఆ వచ్చిన వ్యక్తెవరో కాదు మసూం!

0000000000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

*POST COMMENTS*